





ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ఆకట్టుకున్న క్రీస్తు నాటకం

- భక్తులతో కిక్కిరిసిన 'కల్వరి' ప్రాంగణం

గచ్చిబౌలి/రాయదుర్గం: శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్ల పరిధిలోని పలు కాలనీలు, బస్తీలలో సోమవారం క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. చర్చీలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు చర్చిలలో పాస్టర్లు బోధనలు చేశారు. మియాపూర్ కల్వరి టెంపుల్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి. కల్వరి టెంపుల్ వ్యవస్థాపకులు డాక్టర్ సతీష్ కుమార్ క్రీస్తు జననంపై ఉపన్యసించారు. భారీ సంఖ్యలో భక్తులు కల్వరి టెంపుల్‌కు వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దాదాపు మూడు లక్షలకు పైగా భక్తులు తరలివచ్చారు. కల్వరి టెంపుల్ వద్ద పోలీసులు భద్రత ఏర్పాట్లు చేపట్టారు.







కల్వరి టెంపుల్‌లో ప్రార్థనలు..



గచ్చిబౌలి హౌసింగ్‌బోర్డు కాలనీలోని చర్చిలో దుస్తులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆదర్శప్రాయుడు వాజ్‌పేయి



తారానగర్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



హఫీజ్‌పేట్, మియాపూర్ డివిజన్‌లో.. నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

శేరిలింగంపల్లి: తారానగర్‌లోని చందానగర్ డివిజన్ బీజేపీ కార్యాలయంలో మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జయంతిని సోమవారం నిర్వహించారు. వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పోరెడ్డి బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచం మెచ్చిన నేత వాజ్‌పేయి అని అన్నారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ అధ్యక్షులు రాంరెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రమౌళిగౌడ్, చిన్నం సత్యనారాయణ, సాయికుమార్, సురేష్, అమరేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్, మియాపూర్ డివిజన్ బీజేపీ కార్యాలయంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ రావు, మాజీ కౌన్సిల్ సభ్యులు మనోహర్, ఓబీసీ మోర్చా ఎగ్జిక్యూటివ్ సభ్యులు బోయిన మహేష్ యాదవ్, జిల్లా గీత సెల్ కన్వీనర్ రవిగౌడ్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి విజయేందర్, ఆకుల లక్ష్మణ్, ఎస్సీ మోర్చా డివిజన్ కన్వీనర్ ప్రభాకర్, సిద్ధు, జగన్‌గౌడ్ పాల్గొన్నారు.

దత్తాత్రేయ కల్యాణం

పటాన్‌చెరు టౌన్: ముత్తంగి గ్రామంలో దత్తాత్రేయ స్వామి కల్యాణం కన్నుల పండువగా సాగింది. దత్తాత్రేయ జయంతి ఉత్సవాలలో భాగంగా సోమవారం ముత్తంగిలో మొదటి రోజు స్వామివారి కల్యాణం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ...ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు ఉదయం గోపూజ, గణపతి పూజ, స్వామివారికి అభిషేకం చేసినట్లు తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు.



భూ సమస్యలను పరిష్కరించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రాంతంలో పరిశ్రమల పేరిట ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే గత ప్రభుత్వం రైతుల భూములను లాక్కుందని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ ఆరోపించారు. సోమవారం పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో జయరాజ్ మాట్లాడుతూ... నియోజకవర్గంలో భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గ్రామంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 227 ఎకరాల రైతుల భూములను తీసుకోవడానికి ప్రయత్నం చేసిందన్నారు. 250 మంది రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.15 లక్షల75 వేలు ధర నిర్ణయం చేసిందన్నారు. ఇందులో 100 మంది రైతులు నష్ట పరిహారం తీసుకోలేదన్నారు. అలాగే ఐనోలు గ్రామంలో పరిశ్రమల ఏర్పాటు కోసం సర్వే నంబర్ 39లో 40 ఎకరాల పేదల భూములను తీసుకుందని,ఇప్పటి వరకు ఒక్క పరిశ్రమను కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. అలాగే ఐలాపూర్ గ్రామంలో దాదాపు 500 మంది పేదలు గత ప్రభుత్వ హయాంలో నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేసిందని నేటికీ వారికి న్యాయం జరగలేదని వాపోయారు.ఐలాపూర్ ఘటనలో సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వాజిద్ అలీ, నాయకులు నాగేశ్వరరావు, అర్జున్, రామచంద్రమూర్తి, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

శోభాయాత్ర

కుత్బుల్లాపూర్: అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ఆధ్వర్యంలో ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో శ్రీరామ స్వర్ణ అక్షింతలు శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. చింతల్ బస్టాండ్ సమీపంలోని ఆర్‌ఎస్‌సీ ఆస్పత్రి నుండి ప్రారంభమైన శోభాయాత్ర మాణిక్యనగర్, ద్వారకా నగర్, చెరుకుపల్లి కాలనీ, బాల్‌రెడ్డినగర్, బాపు నగర్, ప్రసూననగర్, శ్రీనివాస నగర్, న్యూవివేకానంద నగర్, శివారెడ్డి నగర్ మీదుగా కొనసాగి చివరకు కుత్బుల్లాపూర్ వేణుగోపాలస్వామి టెంపుల్ వద్ద ముగిసింది. ఈ శోభాయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అక్షింతలను స్వీకరించారు. ఈ యాత్రలో దారి పొడవునా భక్తుల జైశ్రీరామ్ నామ స్మరణతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికత సంతరించుకుంది.

కేలండర్ ఆవిష్కరణ

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో నూతన సంవత్సర కేలండర్‌ను సోమవారం ఆలయ అర్చకులు మహేష్ ,గణేష్‌లు కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి

జిన్నారం(పటాన్‌చెరు): ఇటుకబట్టీలో అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తాపడడంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలో సోమవారం జరిగింది. గుమ్మడిదల ఏఎస్‌ఐ పర్వేజ్ అహ్మద్ కథనం ప్రకారం.. అన్నారంలోని ఎస్‌పీఎస్ ఇటుక బట్టీలో ఒడిశా రాష్ట్రం, తిక్కరపాడ్ గ్రామానికి చెందిన రాజుబెనియా (39) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటుక తయారీలో కేజ్ వీల్స్‌తో కూడిన ట్రాక్టర్‌తో మట్టిని తొక్కించేందుకు నడుపుతుండటంతో అదుపుతప్పి ట్రాక్టర్ పడిపోయింది. డ్రైవర్ ట్రాక్టర్ కింద పడటంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఇటుక బట్టీ ఓనర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

క్రాఫ్ట్ మేళా.. నృత్య ప్రదర్శనలు





మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళా సందర్శకులను ఆకట్టుకుంటుంది. మేళాలో భాగంగా సోమవారం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీవల్లీరావు శిష్య బృందం కథక్ నృత్యప్రదర్శనతో అలరించారు. ఇందులో గణేశ్ వందన, గురు వందన, దుర్గస్తుతి, చపాతీలక్, హోరితరణ అంశాలను ప్రదర్శించారు. అలాగే లక్ష్మీ శంకర్ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. వినాయక కౌతం, గీత రసికే, జటాధరా, కొలువైతివా, గురుస్తుతి తదితర అంశాలతో అలరించారు.

పిచ్చి మొక్కలు.. మురుగు కంపు

- మందుబాబులకు అడ్డా... వ్యర్థాల పారబోత
- అభివృద్ధి పనులు అంతంతమాత్రమే
- ఇదీ మొండికుంట దుస్థితి



అడవిలా మారిన మొండికుంట చెరువు

మాదాపూర్: హైటెక్స్‌కి వెళ్లే దారిలోని మొండికుంట చెరువు పరిసరాలు పిచ్చిమొక్కలు, మురుగుతో కంపు కొడుతోంది. పూర్తిస్థాయిలో పనులు చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది.

- ◆ వాహనదారులు, పాదచారులు దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- ◆ చిరు వ్యాపారులు మిగిలిన వ్యర్థాలను చెరువు ప్రధాన గేటు వద్ద ,అలాగే ఎక్కడ పడితే అక్కడ పడేయడంతో దుర్వాసన వస్తోంది.
- ◆ కొంతమంది మల, మూత్ర విసర్జన సైతం చేస్తున్నారు.
- ◆ మందుబాబులకు అడ్డాగా మారింది.
- ◆ గతంలో లక్షలాది రూపాయలతో కొంతమేర పనులు చేసినా, నిర్వహణ లోపం వల్ల దుర్భరంగా మారింది.
- ◆ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. లైటింగ్ ల్యాంప్‌లు పనిచేయడం లేదు.
- ◆ చెరువుకు భద్రత, సెక్యూరిటీ లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చి వ్యర్థాలు పారబోస్తున్నారు.
- ◆ వాకింగ్ ట్రాక్‌పై ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి.





చెరువు వద్ద వద్ద పిచ్చిమొక్కలు, చెత్త కుప్పలు

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 25, పచ్చిమిర్చి 60-70 , బెండ 70, కాకర 70, దొండ 80, దోస 50, ఆలు 25, చామ 50, కీర 25, బీర 80, వంకాయ 60, గోకర 80, బీన్స్ 60, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 80, ఉల్లి 40 (1 కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 260, వెల్లుల్లి 260.

పేదల కోసం పలు సంక్షేమ పథకాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్రంలో నిరుపేదల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా భారతినగర్ డివిజన్ పరిధిలోని ఫేత్ టెంపుల్ చర్చిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించిన నూతన వస్త్రాలను పంపిణీ చేశారు .కార్యక్రమంలో భారతీనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, రామచంద్రాపురం డివిజన్ అధ్యక్షులు ఈశ్వర్ సింగ్, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షులు హబీబ్ జానీ, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, శాంతమ్మ, పీటర్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ

పటాన్‌చెరు టౌన్: క్రిస్మస్ సందర్భంగా చిట్కుల్ పరిధిలోని చర్చిలలో నీలం మధు ముదిరాజ్ కేక్‌లను పంపిణీ చేశారు.బ్యులా చర్చ్ ఆధ్వర్యంలో కండరాల బలహీనతతో బాధపడుతున్న వారికి దుప్పట్లు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీస్తు చూపిన శాంతి మార్గం సర్వ మానవాళికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, క్రైస్తవులు, ఎన్‌ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

కొల్లూరుకు బస్‌లు ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): హైదరాబాద్ సీబీఎస్ బస్‌స్టేషన్ నుంచి తెల్లాపూర్ మున్సిపాలిటీ కొల్లూరు వరకు సోమవారం నుంచి బస్ సర్వీసులు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ప్రతినిధులు సంబంధిత మంత్రికి తెల్లాపూర్‌కు బస్‌లు నడపాలని కోరుతూ వినతిపత్రం అందించారు. దీంతో సోమవారం నుంచి ఐదు సర్వీస్‌లను ప్రారంభించడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వరగారి రమణ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

'డెస్టినీ' బ్రోచర్ విడుదల



బ్రోచర్‌ను విడుదల చేసిన నిర్వాహకులు, మోడల్స్

మాదాపూర్: నూతన సంవత్సర వేడుకలను మాదాపూర్ ఎన్‌కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఐశ్వర్యసాయి తెలిపారు. మాదాపూర్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డెస్టీని పేరిట డిసెంబర్ 31వ తేదీ నూతన సంవత్సరం వేడుకల్లో యువతను ఆకట్టుకునే విధంగా 4 స్టేజీలను ఏర్పాటు చేసి 8 మంది కళాకారులతో బ్యాండ్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అనంతరం డెస్టీని న్యూ ఇయర్ వేడుకకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చుండూరి ఫణి, వినీత్‌బల్లి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి ఊరేగింపు



శేరిలింగంపల్లి: 'అయ్యప్ప' నామస్మరణతో శేరిలింగంపల్లి ప్రాంతం మారుమోగింది. శేరిలింగంపల్లి తారానగర్‌లోని శివాలయం నుంచి అయ్యప్పస్వామి ఊరేగింపు కార్యక్రమం వైభవంగా సోమవారం రాత్రి నిర్వహించారు. శేరిలింగంపల్లిలోని ఆలిండ్ శ్రీ అయ్యప్ప భక్త సమాజం ఆధ్వర్యంలో 44వ మండల పూజా కార్యక్రమంలో భాగంగా తారానగర్ శివాలయం నుంచి గుల్మోహర్‌పార్కు గేటు ముందు నుంచి శేరిలింగంపల్లి ఆలిండ్ అయ్యప్ప ఆలయం వరకు కొనసాగింది. ఊరేగింపులో భాగంగా స్వామిని ప్రత్యేకంగా అలకరించిన వాహనంలో నాదస్వరం, చండమేళం, కావడి అట్టం, సింగారి మేళం, అమ్మన్ కూడం తదితర కార్యక్రమాలతో కొనసాగింది. ఈ ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గాంధీకి సన్మానం



గచ్చిబౌలి: కొండాపూర్ డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్ ఏబ్లాక్ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు బలరామ్‌యాదవ్ ఆధ్వర్యంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులతో కలసి ఎమ్మెల్యే గాంధీని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో శ్రీరామ్‌నగర్ ఏ బ్లాక్ కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందిరానగర్‌లో సోమవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. భూపాల్‌పల్లి జిల్లాకు చెందిన మధుసూదన్ (36) గత ఐదేళ్ల క్రితం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్‌కు వలస వచ్చాడు. ఇందిరానగర్లో ఓ ఇంట్లో అద్దెకుంటూ కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత పదేళ్ల క్రితం వివాహం జరిగింది. కాగా సోమవారం ఉదయం అతని భార్య ఇంట్లోంచి బయటికి వెళ్లిన సమయంలో గదిలోని ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.కుటుంబ కలహాల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు.మృతుని తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై..

పటాన్‌చెరు టౌన్: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు.అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని సాయిరాం ఎన్‌క్లేవ్ కు చెందిన విఠల్(60) మద్యానికి బానిస అయ్యాడు. తరచు మద్యం తాగుతున్నాడని కుటుంబ సభ్యులు డబ్బులు ఇవ్వడం మానేశారు. ఈ క్రమంలో 24వ తేదీ కుటుంబ సభ్యులు బయటకు వెళ్లడంతో విఠల్ ఆదివారం రాత్రి చున్నీతో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి ఉరివేసుకొని కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.